ప్రజాశక్తి
ఆదివారం 31 డిసెంబర్ 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు




సాగులో పెరిగిన ఆటుపోట్లు

అతివృష్టి,అనావృష్టితో అల్లాడిన రైతులు

పంటలను దెబ్బతీసిన మిచౌంగ్ తుపాను

2023 వ్యవసాయ రౌండప్


తెనాలిలో వర్షాభావంతో ఎండిన వరి పంట (ఫైల్)


యడ్లపాడులో తుపాను ధాటికి దెబ్బతిన్న మిర్చి పంట (ఫైల్)

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయం ఆటుపోట్ల మధ్య సాగింది. ఆదిలో తీవ్ర వర్షాభావం, చివరలో తుపాను తాకిడికి పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు కంటిమీద కునుకు కరువైంది. రైతులకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఆశించిన ప్రయోజనాలు దక్కలేదు. పిఎం కిసాన్,రైతు భరోసా తప్ప రైతులకు ఇతర సదుపాయాలు నామమాత్రంగానే అందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాలు తగిన భరోసా ఇవ్వలేకపోతున్నాయి.

పల్నాడు జిల్లాలో నవంబరు వరకు తీవ్ర వర్షాభావం వల్ల వ్యవసాయం సాఫీగా సాగలేదు. వేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.పల్నాడు జిల్లాలో నిర్ధేశిత విస్తీర్ణం కన్నా దాదాపు లక్షన్నర ఎకరాల్లో ఎటువంటి పంటలు వేయలేదు. జూన్,జులైలో సాధారణ వర్షపాతంకూడా నమోదు కాకపోవడం వల్ల సాగులో తీవ్ర జాప్యం జరిగింది.

నాగార్జున్ సాగర్ జలాశయం నుంచి నీరురాకపోవడంతో వరి సాగు గణనీయంగా తగ్గింది. బోర్ల కింద మాత్రమే రైతులు సాగు చేశారు. కాల్వలకు కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే నీరు ఇచ్చారు. దీంతో పల్నాడు జిల్లాలో వరి సాగు తగ్గగా పత్తి, మిర్చి కూడా పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోయారు. మిచౌంగ్ తుపానుకు పల్నాడు జిల్లాలో వరి, మిర్చి, పత్తి, శనగ, ఇతర అపరాలపంటలకు నష్టం జరిగింది. గత నాలుగేళ్లుగా ప్రతి ఏటా సాగర్ జలాశయానికి వరద ప్రవాహం రాగా ఈఏడాది వర్షాభావంతోపాటు ఎగువ నుంచి వరద రాకపోవడంతో సాగర్ ఆయకట్టుపరిధిలో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్టోబరులో తీవ్ర వర్షాభావం వల్ల 28 మండలాలను కరువు మండలాలుగా అధికారులు ప్రతిపాదించినా ప్రభుత్వం ఆమోదించలేదు. కనీసం ఒక్కమండలాన్ని కూడా పరిగణలోకి తీసుకోలేదు. కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిసిఆర్‌సిలు ఉన్నా బ్యాంకర్లు రుణాలు ఇవ్వలేదని పలువురు వాపోయారు. గుంటూరు జిల్లాలో వరి, మిర్చి, పత్తి పంటలు సాగు దాదాపు 80 శాతం జరిగింది. వరికి వర్షాభావం, తుపాను తాకిడి ఎడాపెడా తగలడంతో రైతులకు గోడదెబ్బ, చంపదెబ్బ మాదిరిగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తుపానుకు 39,870 మంది రైతులకుచెందిన 73 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. కౌలు రైతులకు పంట

2 లో

ట్రాక్టర్ డ్రైవర్ దౌర్జన్యం

సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికుడిపై పాశవిక దాడి

అధికారుల ఆదేశాలతోనే సంఘటన : సిఐటియు


చికిత్స పొందుతున్న కార్మికుడు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె నరసరావుపేటలో కొనసాగుతుంది. సమ్మె నేపథ్యంలో ఇతర పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులను నిలిపివేయాలని సమ్మెకు సహకరించాలని కోరుతూ అడ్డుకున్నారు. ఈ క్రమంలో డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెకు సహకరించాలని ట్రాక్టర్‌కు అడ్డు నిలిచిన ఒప్పంద కార్మికుడు పేరుపోగు మోషే పై ట్రాక్టర్ డ్రైవర్ ప్రత్తిపాటి కోటయ్య దురుసుగా వ్యవహరిస్తూ ట్రాక్టర్ తో ఢీ కొట్టాడు. ఘటనలో తీవ్ర గాయాలు పాలైన మోషేను తోటి కార్మికులు పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్యాలయం గేట్లు మూసి

2లో



2 లో

బలహీనవర్గాల సాధికారతకు కృషి

హోరెత్తిన అంగన్‌వాడీల నినాదాలు

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర ప్రధాన డిమాండ్లతో గత 19 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు, పట్టాభిపురంలోని మంత్రి ఇంటిని ముట్టడించారు. తౌలుత స్వామి థియేటర్ నుండి వేలాది మంది అంగన్‌వాడీలు ర్యాలీగా ఇంటి వద్దకు వచ్చారు. అక్కడే రోడ్డుపై బైటాయించారు. వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. పోరాడి తీరుతాం..సాధించి తీరుతాం.. అంటూ నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. సుమారు గంట పాటు ఆందోళన కొనసాగించారు. ఆ తర్వాత మంత్రి రజని బయటకు వచ్చి అంగన్‌వాడీలతో మాట్లాడారు. వారి నుండి వినతిపత్రం స్వీకరించారు. నాయకులు సమస్యను మంత్రికి వివరించారు. ముఖ్యంగా వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తూ సమస్యను ఖచ్చితంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు)జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ మాట్లాడుతూ 19 రోజులుగా లక్ష మందికిపైగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం మొండి వైఖరితో ఉండటం సరికాదన్నారు. అన్ని రకాల ధరలూ పెరిగిన నేపథ్యంలో వేతనాలు పెంచాల్సిందేనని, అప్పటి వరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి, జిల్లా నాయకులు బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాస్, ఎఐటియుసి నాయకులు వి.రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


నరసరావుపేటలో ఎంపీ క్యాంపు కార్యాలయ గేటుకు వినతిపత్రం కడుతున్న యూనియన్ నాయకులు

గుంటూరులో మంత్రి రజని ఇల్లు ముట్టడి

నరసరావుపేటలో ఎంపి కార్యాలయం గేటుకు వినతి పత్రం


మంత్రి ఇంటి ముందు బైటాయించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నరసరావుపేటలో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 19వ రోజుకు చేరుకుంది. శనివారం సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టేషన్ రోడ్డు, గాంధీ పార్క్ వద్దగల సమ్మె శిబిరం నుండి ఎన్జీవో కాలనీలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయల క్యాంపు కార్యాలయం వరకు యూనియన్ నాయకులు ర్యాలీ చేపట్టారు. ఎంపీ కార్యాలయం గేటుకు తాళం వేసి ఉండటంతో గేటుకు వినతిపత్రం కట్టారు. శ సమ్మె శిబిరంలో యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కెపి మెటిల్డాదేవి మాట్లాడుతూ 19 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ స్పందించకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కార్మికులు ఉద్యోగుల హక్కులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాల రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే స్పందన

2 లో



ఆరేళ్ల బాలుడిపై కుక్కల దాడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, గుంటూరు

గుంటూరులో ఆరేళ్ల బాలుడిపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఘటన శనివారం సంపత్ నగర్ శివాలయం వద్ద జరిగింది. గాయపడిన బాలుడ్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయాన్నే కరాటే తరగతులకు వస్తున్న బాలుడు కార్తికేయపై ఐదు కుక్కలు దాడి చేశాయి. సకాలంలో స్పందించి బైక్ పై వచ్చిన వాహనదారుడు ఒకరు బాలుడ్ని కాపాడారు. సెలవులు కావటంతో బంధువులు ఇంటికి వచ్చిన బాలుడ్ని కుక్కలు కరవడంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

సత్వరమే స్పందించిన కమిషనర్

ఆరేళ్ల బాలుడిపై వీధికుక్కల దాడి ఘటనపై సత్వరమే స్పందించిన కమిషనర్ సదరు

2 లో


క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న డిఇఒ, యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

యుటిఎఫ్ 2024 సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం డిఇఒ కార్యాలయంలో ఆవిష్కరించి, ఉపాధ్యాయులకు, నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయులు విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని కోరారు.ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏ.ఎల్.శివపార్వతి, కోశాధికారి దౌలా, కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, ధనలక్ష్మి, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, కె.ప్రభూజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలోని ఐటి హబ్ అసోసియేషన్ వారు 2024 క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, సిఎస్ఐటి విభాగాధిపతి జె.భార్గవ్, ఐటి హబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రద్యుమ్న

ఉండవల్లిలోని దేవుడుమాన్యంలో శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ స్పోర్ట్స్ టిఎస్ ప్రద్యుమ్న ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్, సెక్రటరీ వి.శ్రీనివాసరావు, ఎంటిఎంసి నగర అధ్యక్షులు డి.వేమారెడ్డి, యు.కల్యాన్‌కుమార్, ఎం.అంజిరెడ్డి నగర పాలక సిబ్బంది పాల్గొన్నారు.


అలివేలమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుమాక మాజీ సర్పంచ్ అలివేలమ్మ మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రస్తుతం రాజధానిలో భాగమైన పెనుమాక మాజీ సర్పంచ్ పలగాని అలివేలమ్మ (82) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. 1995 నుంచి 2000 వరకు ఆమె పెనుమాక గ్రామానికి సిపిఎం సర్పంచ్‌గా పని చేశారు. అప్పట్లో నిమ్మగడ్డ రామ్మోహనరావు మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన తోడ్పాటుతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. అలివేలమ్మ మృతదేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, తాడేపల్లి మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పెనుమాక సిపిఎం కార్యదర్శి ఎస్‌కె పీరూసాహెబ్, టిడిపి జిల్లా నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, సిపిఐ నాయకులు గుంటక సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్ కళ్లం అనంతశివారెడ్డి, స్థానికులు జి.రామ్మోహనరావు, కె.వేణుగోపాలరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

హోరెత్తిన అంగన్‌వాడీల నినాదాలు

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిశీలించక పోతే మరో 4 నెలల్లో రానున్న ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి హెల్డా ఫ్లారిన్స్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జరిపిన చర్చలు విఫలమైన నేపథ్యంలో మళ్లీ చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి త్వరలో పరిష్కారం చూపాలని లేకుంటే సమ్మెను ఇంకా ఉధతం చేస్తామని హెచ్చరించారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి మాట్లాడుతూ గతంలో తమిళనాడు రాష్ట్రంలో ఇదేవిధంగా కొంతమంది ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపట్టారని నాటి ముఖ్య మంత్రి జయలలిత లక్ష మందికి పైగా ఉద్యోగులను తొలగించారని అనంతరం వచ్చిన ఎన్నికల్లో ఆమె ఓడిపోయిన తీరు వైసిపి ప్రభుత్వం గ్రహించాలని వైసిపి ప్రభుత్వానికి కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ఇదే క్రమంలో అంగన్వాడీలకు మద్దతు తెలుపుతూ అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్న టిడిపి నేతలు అంగన్వాడీలకు ఏమి చేయగలరో స్పష్టత చేయాలన్నారు. అనేక మంది కార్మికులు చిరు ఉద్యోగులు కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీల వేతనాలు ఎందుకు పెంచాలి అని అంగన్వాడీల సమస్యలపై ఏమాత్రం అవగాహన లేని మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడడం తగదని విమర్శించారు. అనంతరం అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్


నరసరావుపేట సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కె. సుబ్బరావమ్మ ల ఆధ్వర్యంలో ప్రచురించిన వినతి పత్రాలను ఆయా పరిధిలోని సచివాలయాలలో అందజేయాలని అంగన్వాడీలకు సూచించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లుదియా,ఖాసీంబి, కవిత, కష్ణవేణి ,హసీనా, సాయి, ఏఐటియుసి నాయకులు కళావతి, సౌభాగ్యం, జ్యోతి, హసీనా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

న్యాయమైన తమ కోర్కెలను నెరవేర్చాలని పొన్నూరు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పొన్నూరు తహసిల్దార్ కార్యాలయం వద్ద శనివారం 19వ రోజు నిరసన దీక్ష చేపట్టారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న అంగన్వాడిల జీతాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రం కన్నా వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. సిఐటియు నాయకులు నిమ్మకూరు రమేష్ బాబు, మండల అంగన్వాడి లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంగన్వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. స్థానిక విఎస్ఆర్


గుంటూరులో అంగన్వాడీలతో మాట్లాడుతున్న మంత్రి రజని

కళాశాల ఎదురుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో సిఐటియు, సిపిఎం పార్టీలు తమ పూర్తి మద్దతును తెలిపాయి. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లిపర బాబుప్రసాద్, షేక్ హుస్సేన్ వలి ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి పావని, విజయలక్ష్మి, ఎలిజబెత్, రంగ పుష్ప పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుగ్గిరాల :గత 19 రోజుల నుండి అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేస్తున్న శిబిరానికొచ్చి శనివారం ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల హక్కుల సాధన కోసం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం సత్వరమే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచంద్రయ్య రాష్ట్ర కౌన్సిలర్ కె వి సుబ్బారావు ఉపాధ్యాయుడు ఉన్నం ప్రసాద్ సిఐటియు కి చెందిన జెట్టి బాలరాజు సిపిఎం పార్టీకి చెందిన చొక్కాకుల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.


దుగ్గిరాలలో అంగన్వాడీల శిబిరానికి వచ్చే సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయులు

బలహీనవర్గాల సాధికారతకు కృషి

సాకారం చేసిన వ్యక్తి జగన్ :మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/తాడికొండ

వైసిపి ప్రభుత్వంలో సామాజిక న్యాయం పూర్తిగా అమలు అవుతోందని రాష్ట్ర మునిసిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. తాడికొండలో సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం జరిగింది. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అధ్యక్షత వహించారు. నాలుగున్నరేళ్లలో సాధించిన విజయాలు, సాధికారతను నేతలు వివరించారు. ఆదిమూలపు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మార్కెట్ యార్డులు, దేవాలయాలు, ఇతర నామినేటెడ్ పదవుల్లో బడుగు బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించామని తెలిపారు. ఎస్‌సిలను విడగొట్టి రాజకీయ లబ్ధిపొందిన చంద్రబాబు తరువాత వారిని పట్టించుకోలేదన్నారు. తమ పార్టీ నాయకులు 175 నియోజకవర్గాల్లో ఎక్కడైనా మేము పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామంటే సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్న మీకు మేలు జరిగితేనే ఓటేయాలని ధైర్యంగా అడిగే నాయకుడు జగన్ మాత్రమేనని అన్నారు. తాడికొండ నియోజకవర్గం నడిబొడ్డున దళితులు ఉండరాదని చెప్పి టిడిపి అభ్యర్థులకు బుద్ధి చెప్పాలన్నారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కుప్పంలో గుక్కెడు మంచి నీళ్ల ఇవ్వలేని బాబు ఎయిర్ పోర్టు ఏం కట్టిస్తాడని ప్రశ్నించారు. వైసిపి హయంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టడంలో అవినీతి జరిగిందంటూ పవన్ ప్రధానికి లేఖ రాశాడని ఈఅంశంపై మీడియా ముందు బహిరంగ చర్చకు రావాలన్నారు. సాధ్యం అని పలువురు వక్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందని ప్రతిపాడు శాసనసభ్యురాలు నియోజకవర్గ ఇన్చార్జి మేకతోటి సుచరిత అన్నారు. వైసిపి ప్రభుత్వం అదికారం లోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరిగిందన్నారు ప్రజా ప్రయోజనాలను దష్టిలో పెట్టుకొని సచివాలయ వ్యవస్థను తీసుకురావటం జరిగిందన్నారు గుంటూరు తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందించిందన్నారు సుచరిత గెలుపుకు తన సహకారం ఉంటుందని అన్నారు. సుచరితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు ఎంపీ అయోధ్య రామీ రెడ్డి మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాలు కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతి గురించి వివరించారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు.ముందుగా స్థానిక అడ్డరోడ్డు వద్ద నుండి తాడికొండ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్యేలుకిలారి రోశయ్య, నంబూరు శంకర్రావు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, డొక్కా మాణిక్య వరప్రసాద్, పోతుల సునీత, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలుడిపై కుక్కల దాడి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతంలో వీధి కుక్కలను పట్టుకొని యాంటి ర్యాబీస్ వ్యాక్సిన్ చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సంపత్‌నగర్‌లో కార్తికేయ అనే బాలుడు వీధిలో వస్తుండగా వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయని తెలిపారు. జిఎంసి ప్రజారోగ్య అధికారి మధుసూదన్ గాయపడిన బాలుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా సంపత్ నగర్‌లోని పలు వీధుల్లో వీధి కుక్కలను ప్రజారోగ్య సిబ్బంది బంధించి ర్యాబీస్ వ్యాక్సిన్ చేయించడం జరిగిందని, సదరు ప్రాంతంలో వీధి కుక్కలకు గతంలోనే యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ చేయడం జరిగిందన్నారు. ఏటుకూరురోడ్డులో జిఎంసి ఆధ్వర్యంలో వీధి కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించగా, కొందరు కోర్టుకి వెళ్లడం వలన నిలిపివేయడం జరిగిందని, దీని కారణంగానే నగరంలో వీధి కుక్కల సంఖ్య పెరిగిందన్నారు. జంతు ప్రేమికులు కూడా వీధి కుక్కల వలన నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను గమనించి నగరపాలక సంస్థకు


బాలుడిని పరామర్శిస్తున్న అధికారులు

సహకరించాలని కోరారు.

ట్రాక్టర్ డ్రైవర్ దౌర్జన్యం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనిపై యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్ మాట్లాడుతూ అధికారుల ఆదేశాల నేపథ్యంలోనే కార్మికులను భయ భ్రాంతులకు గురి చేసి సమ్మె విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలలో భాగంగానే ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అధికారులు ఎన్ని బెదిరింపులకు పాల్పడినా సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కార్మికుడిని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి యూనియన్ నాయకులు సాల్మన్ తదితరులు పరామర్శించారు. మోషే ఆరోగ్యం నిలకడగా ఉందని ఎటువంటి ప్రాణాపాయం లేదని తీవ్ర గాయాలపాలైన నేపథ్యంలో కొంత కాలం విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. దీనిపై మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ట్రాక్టర్ డ్రైవర్ కోటయ్య పై 1వ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

సాగులో పెరిగిన ఆటుపోట్లు

(మొదటిపేజీ తరువాయి)

నష్టం జరిగినా కొన్ని ప్రాంతాల్లో వారిపేర్లు కాకుండా ఈ క్రాప్‌లో నమోదు అయిన భూ యజమానులే పంట నష్ట పరిహారం పొందటానికి అర్హులయ్యారు. ఖరీఫ్‌లో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా రబీలో కూడా జొన్న, మొక్కజొన్న సాగుకు వర్షాభావం వెంటాడుతుంది. సాగర్ కాల్వలనుంచినీటి విడుదల నిలిచిపోయింది. కేవలం మినుము,పెసర మాత్రమే సాగుచేసుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. తుపాను వల్ల తడిసినరంగు మారిన ధాన్యం కొనుగోలుకుఇంకా మార్గదర్శకాలు రాలేదు. తుపాను ప్రభావంతో జిల్లాలో లక్ష ఎకరాల్లోవరి దిగుబడి గణనీయంగా తగ్గనుంది. జిల్లాలో మిర్చిరైతులకు ప్రస్తుతం ఉన్న ధర ఆశాజన కంగా ఉన్నా వర్షాభావం వల్ల పంటదిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు. త్వరలో ఒక తడికి నీరు ఇస్తే తప్ప మరోసారి కోతకు కాయలు వచ్చేపరిస్థితి లేదు. పత్తిరైతులకు ఈ ఏడాది నష్టాలు మిగిలాయి. కనీస మద్ధతు ధర కన్నా తక్కువకే వ్యాపారులు కొనుగోలు చేశారు. కౌలు రైతులకు బ్యాంకర్లు మొండిచేయి చూపారు. జిల్లాలో దాదాపు 40 వేల మందికి సిసిఆర్‌సిలు ఇచ్చినా ఇప్పటి వరకు కౌలురైతులు 7,339 మందికి కేవలం రూ.44.90 కోట్లు మాత్రమే రుణాలు ఇచ్చారు. కౌలు రైతులకు పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. రాబడి తగ్గుతోంది.అయినా ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సహకాలు ఉండటం లేదు.



ఆచార్య కె.మధుబాబుకు ఐఈఏ అవార్డు

ప్రజాశక్తి-ఎ ఎన్ యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె. మధుబాబుకు ఐఈఏ (ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్) అవార్డు లభించింది. ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్ లోని కేఐఐటీ(కళింగ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు ఐఈఏ 106వ వార్షిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎంప్లాయిమెంట్ అండ్ లేబర్ మార్కెట్ డిస్క్రిమినేషన్ అనే అంశంపై జరిగిన సెషన్ లో మధుబాబు కోవిడ్ - 19 ఇంపాక్ట్ ఆన్ రూరల్ ఎంప్లాయిమెంట్ విత్ రిఫరెన్స్ టూ హ్యాండిక్రాఫ్ట్స్ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కోవిడ్ - 19లో అకస్మాత్తుగా విధించిన లాక్ డౌన్ వల్ల మూతబడిన గ్రామీణ హస్తకళలు, ఆ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఆ రంగంలో ఉపాధి కోల్పోయిన వారి స్థితిగతులు, సమస్యలు, జీఎస్టీ ప్రభావం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆచార్య మధుబాబు తన పరిశోధనా సత్రంలో సమర్పించారు.ఈ పరిశోధనా పత్రాన్ని ఐఈఏ కమిటీ' బెస్ట్ పేపర్ మెరిట్ అవార్డు'కు ఎంపిక చేసింది. భారత ప్రభుత్వ ప్లానింగ్ కమీషన్ మాజీ చైర్మెన్ డాక్టర్ మాంటెక్ సింగ్ ఆహ్లూవాలియా అధ్యక్షతన జరిగిన ఐఈఏ ముగింపు సభలో ఆచార్య కె. మధుబాబుకు ఈ అవార్డును విట్ తమిళనాడు వీసీ ఆచార్య జి .విశ్వనాధన్, పార్లమెంట్ సభ్యుడు, కేఐఐటీ వ్యవస్థాపకుడు ఆచార్య అచ్యుత సమంత, కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఆచార్య బిశ్వజిత్ ఛటర్జీ, ఐఈఏ మాజీ అధ్యక్షుడు ఆచార్య ఎస్. మహేంద్రదేవ్, డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ యూనివర్సిటీ వీసీ ఆచార్య తమన్ కుమార్ సౌండిల్య ఆచార్య కె మధుబాబుకు ఈ అవార్డును ప్రదానం చేశారు.



ఎఎన్‌యు విద్యార్థిని లహరికి నంది అవార్డు

ప్రజాశక్తి-ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభించిన డిపార్ట్మెంట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విద్యార్థులు గుంటూరులో జరిగిన 22వ రాష్ట్రీయ నంది నాటకోత్సవాల లో పాల్గొనగా, ఆ నాటకోత్సవాల్లో గుడివాడ లహరి అనే విద్యార్థిని చీకటి పువ్వు అనే నాటికలో కథానాయక పాత్ర పోషించారు. లహరి ఈ పాత్రకు జీవం పోసారని చెప్పవచ్చు. సాధారణంగా విశ్వవిద్యాలయ స్థాయిలో బోధన, పరిశోధనలకు ఎక్కువ స్కోపు ఉండేదని ప్రస్తుతం కొత్తగా ప్రారంభించిన పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ లో చేరిన విద్యార్థులు థియేటర్ ఆర్ట్స్ కేటగిరీలో పాల్గొని అవార్డులు పొందటం జరిగింది. అనతి కాలంలోని లహరి 5 నాటికల్లో పాల్గొని చీకటిపువ్వు అనే నాటిక ద్వారా ఉత్తమ నటిగా నంది అవార్డు సాధించింది. తనలోని ప్రతిభ, నాటక రంగంపై ఆసక్తి చూపర్లను కట్టిపడేసిందని చెప్పవచ్చు. ముఖ్యంగా లహరి నాయిక పాత్రకు జీవం పోసింది. నాయిక పాత్రలో తన ప్రదర్శన ద్వారా అభిమానుల నుంచి హర్షధ్వానాలు స్వీకరించడం ఎంతో ప్రతిభవంతులైతే తప్ప సాధ్యం కాదు. నంది అవార్డు లభిస్తుందనటానికి లహరి చేసిన ప్రదర్శన ఒక ఉదాహరణ. మరో విద్యార్థిని అమత వర్షిని రెండు నాటికల్లోనూ, ఎస్కే హసన్ ఒక నాటకంలోనూ వారి ప్రదర్శనను చూపారు. యూనివర్సిటీ తరపున విద్యార్థిని లహరికి నంది అవార్డు రావడం పట్ల వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

వియత్నాం బుద్ధిస్ట్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం



ప్రజాశక్తి-ఏఎన్యూ

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని బౌద్ధ అధ్యయన విభాగాధిపతి ప్రొఫెసర్ ఎల్ ఉదయ్ కుమార్ ఈనెల 25, 26 తేదీల్లో వియత్నాంలో జరిగిన రెండవ కంబోడియా లాటిస్ మరియు వియత్నం బుద్ధిస్ట్ సమ్మిట్ కు హాజరయ్యారు. ఈ సదస్సులో ఉదయ్ కుమార్ బుద్ధిస్ట్ సస్టైనబుల్ డెవలప్మెంట్ న్యూ వాయిస్ ఇన్ రెస్పాన్స్ టు ది ఎన్విరాన్మెంటల్ క్రైసిస్ అనే అంశం మీద ప్రసంగించారు. ఈ అంతర్జాతీయ సదస్సు వియత్నాం బుద్ధిస్ట్ యూనివర్సిటీ లో జరిగింది. ఈ సదస్సులో బుద్ధిస్ట్ యూనివర్సిటీ కి మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వియత్నాం బుద్ధిస్ట్ యూనివర్సిటీ వైస్ రెక్టర్ ప్రొఫెసర్ ట్రిచ్ న్హత్ టు ఉదయ్ కుమార్ కు అందజేశారు.

జెడ్పిటిసి పదవి ఎవరో పెట్టిన బిక్ష కాదు

రాజీనామా లేఖను సమర్పించిన జడ్పిటిసి జంగా వెంకట కోటయ్య

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల మండల జడ్పిటిసి పదవి మాకు ఎవరో పెట్టిన బిక్ష కాదని పార్టీలో కష్టపడినందుకు పార్టీ ఇచ్చిన పదమని పిడుగురాళ్ల జడ్పిటిసి జంగా వెంకట కోటయ్య అన్నారు. శనివారం జడ్పిటిసి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజీనామా లేఖను జిల్లా పరిషత్ లో అందించినట్లు ఆయన పేర్కొన్నారు. వైయస్సార్ పార్టీ వ్యవస్థాపకుల్లో మా తండ్రి జంగా కృష్ణమూర్తి ఒకరిని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యోజన విభాగంలో ప్రధాన కార్యదర్శిగా దశాబ్ద కాలంగా పనిచేశానని పదవులు అనేవి పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి అందించేయగానే ఎవరి భిక్షో కాదని ఆయన తెలిపారు జడ్పిటిసి పదవి తనకు ఇచ్చింది శాసనసభ్యులు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి గురజాల నియోజకవర్గం లో రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా సేవలు అందించాలని 40 సంవత్స రాలుగా రాజకీయాలలో ఉన్నమని ఈ ప్రాంత ప్రజలు మమ్మల్ని ఆదరించారని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గురజాల నియోజకవర్గం లో ఎమ్మెల్సీ వర్సెస్ ఎమ్మెల్యే వివాదం జరుగుతున్న సమయంలో జంగా కృష్ణమూర్తి కుమారుడు జంగా వెంకట కోటయ్య జెడ్పిటిసి పదవి అనేది భిక్ష అన్నట్లుగా మాట్లాడిన దానికి నిరసనగా జడ్పిటిసి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పటం మరింత ఆసక్తిగా మారింది.

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-ఈపూరు



ప్రజా సమస్యల పట్ల వామపక్షాలు నిరంతరం పోరాటాలు చేస్తాయని పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అంగన్వాడి కార్యకర్తలు చేపట్టిన 19వ రోజు సమ్మెకు వామపక్ష నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు కమ్యూనిస్టు నాయ కులను చందాల పేరుతో హేళనగా మాట్లాడటం వారి అవి వేకానికి నిదర్శనం అన్నారు. అంగన్వాడీల సమస్యల పట్ల వినతిపత్రం ఇచ్చేందుకు ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లిన ఏఐటీయూసీ, సిఐటియు నాయకులను దుర్భాషలాడారని అంగన్వాడీ మహిళల పట్ల దురుసుగా వ్యవహరించారని ఎమ్మెల్యే బొల్లా పద్ధతులు మార్చుకోవాలని హితవు పలికారు. పల్నాడు జిల్లా సిఐటియు అధ్యక్షులు కె హనుమంతురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ర్యాలీ గా వెళ్లి ఈపూరు సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ పావనీకు వినతి పత్రం అందజేశారు.

'హామీల అమలులో 85 శాతం ఫెయిల్'



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మేనిఫెస్టో బైబిల్,ఖురాన్,భగవద్గీత అంటూ సూక్తులు చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన 730 హామీల్లో 15 శాతం హామీలు మాత్రమే అమలు చేసి 99 శాతం హామీలు అమలు చేశామని అసత్య ప్రచారాలు చేసుకోవడం ప్రజలను మభ్యపెట్టడమేనని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు.స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం టిడిపి రూపొందించిన హామీల అమలులో వైసిపి 85 శాతం ఫెయిల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఎన్నికలకు ముందు నెత్తిన ముద్దులు పెట్టి,నవరత్నాల పేరుతో నమ్మించి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజల్ని జగన్ మోసం చేశాడన్నారు.బడుగు,బలహీన వర్గాలను సంక్షేమం మాటున గొంతు కోశాడని విమర్శించారు.



ఘనంగా ఎంసిఏ పూర్వ విద్యార్థుల కలయిక

దేశ, విదేశాల నుండి తరలి వచ్చిన ఐటి నిపుణులు

ప్రజాశక్తి-ఎఎన్‌యు

వారంతా తొలితరం ఐటి నిపుణులు. 25 సంవత్సరాల క్రితం నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంసిఎ అభ్యసించారు. ఇప్పుడు దేశ విదేశాల్లో ఉన్నత స్దానాల్లో ఉన్నారు. శనివారం అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగం వేదికగా వారంతా ఒక్కటయ్యారు. ఒకరిది అమెరికా, మరోకరి స్ధిర నివాసం సింగపూర్, ఇంకొకరిది మల్టినేషనల్ కంపేనీలో ఉన్నత స్దాయి పదవి ఇలా ఒక్కొక్కరూ విభిన్న స్దాయిలలో ఎదిగి ఒదిగారు. ఇప్పుడు వారి ఆనందానికి అవధులు లేవు. పాత స్రతులు నెమరవేసుకున్నారు. పరస్పరం ఏలా ఉన్నారంటూ ఊసులాడారు. అలానాటి మధుర ఘట్టాలను గుర్తు చేసుకున్నారు. ఇరవై అయిదు సంవత్సరాల క్రితం 1995 - 1998 బ్యాచ్ గా విశ్వవిద్యలయంలో చదువుకున్న వారంతా మళ్లి కలవటం అంటే చిన్న విషయం కాదు. ఇందుకు ఎంతో శ్రమ, సహకారం అవసరం. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధినేత అచార్య కె. గంగాధర రావు ముందుండి కార్యక్రమాన్ని నడిపించారు. పూర్వ విధ్యార్ధుల కలయికకు ముఖ్య అతిధిగా హాజరైన విశ్వవిద్యాలయం రెక్టర్ అచార్య వరప్రసాద మూర్తి ని ఈ సందర్భంగా పూర్వ విద్యార్ధులు ఘనంగా సన్మానించారు. తమ ఉన్నతికి బీజం వేసిన నాటి అధ్యాపక, అధ్యాపకేతరులను కూడా ఉచిత రీతిన గౌరవించారు. నేటి తరం విద్యార్ధులు ఏలా ఎదగాలి అన్న దానిపై తమ సలహాలను ఇచ్చారు. విదేశాలలో ఉన్న అవకాశాలు, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు నైపుణ్యాన్ని ఫెంచుకోవలసిన పరిస్థితుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈ విభాగపు పూర్వ అధ్యాపకులు సత్య ప్రసాద్ , కృష్ణ ప్రసాద్, విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం నుండి అచార్య శివరామప్రసాద్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ త్రిమూర్తి, మాజీ అచార్యులు రమేష్ బాబు, వరల్డ్ బ్యాంక్ అధికారి వివిన్ ప్రసాద్, నెషనల్ ఇన్ ఫర్ మేటిక్ సెంటర్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలు అల్లర్లు చేస్తే శిక్షిస్తాం

సిఐ ఏవి బ్రహ్మం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండలంలో ప్రజలు డిసెంబర్ 31, జనవరి 1 తేదీ వేడుకలను నియమ నిబంధనలతో జరుపుకోవాలని సిఐ ఏవి బ్రహ్మం తెలిపారు. మద్యం తాగి, వాహన పత్రాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై జరిమానా విధించబడునని ఆయన హెచ్చరించారు. మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసే సమయంలో ఆకతాయిలు అల్లర్లు చేస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. డీజే బాక్సులు పెట్టుకొని.. అసభ్యకరమైన డాన్సులు వేస్తే శిక్షిస్తామన్నారు. మండల ప్రజలందరికీ 2023 సంవత్సరం వెళ్తూ 2024 అడుగుపెడుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు.

మెల్లెంపూడి లో కొండచిలువ కలకలం

కొండచిలువల బారిన పడకుండా ప్రజలను కాపాడాలి.

టిడిపి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



ఎంటిఎంసీ పరిధిలోని మెల్లెంపూడి బకింగ్ హామ్ కెనాల్ వద్ద తరచు కొండ చిలువలు ప్రత్యక్ష మవుతున్నాయి. కాలువ నుండి పి డబ్ల్యు డి కట్ట పైకి వస్తుండడంతో అటుగా వెళ్ళు రైతులు, కార్మికులు, మహిళలు స్థానిక ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి కొండచిలువ కాలువ నుండి రోడ్డు పైకి రావడంతో స్థానిక యువకులు గమనించి, కేకలు వేయడంతో కే ఎల్ యు వైపు వెళ్లే వాహన దారులు అప్రమత్తమయ్యారు. యువకులు కొండచిలువను వెంబడించి చంపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం మెల్లెంపూడి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్ మాట్లాడుతూ గ్రామంలో తరచూ రైతులు, కార్మికులు, వ్యవసాయ పనులకి వెళ్లే మహిళలు బకింగ్ హామ్ కెనాల్ వైపు నుండి పనుల నిమిత్తం వస్తుంటారని, వారానికి ఒక కొండచిలువ ప్రత్యక్షమవుతూ ఉంటే భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే సంబంధిత అటవీ శాఖ అధికారులు కొండచిలువల బారిన పడకుండా, ప్రజలను కాపాడాలని అధికారులను కోరారు.



క్రీడాకారులకు కిట్లు అందచేస్తున్న సుబ్బారావు తదితరులు

క్రికెట్ పోటీలను ప్రారంభించిన జెడ్పీటిసి సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్ మండలం పరిధిలోని వెంగళాయపాలెం గ్రామంలో శని వారం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నిర్వహి స్తున్న క్రికెట్ పోటీలను జెడ్పీటిసి తుమ్మల సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో, గుంటూరు ఇఒఆర్‌డి శ్రీనివాసరావు, గుంటూరు మిర్చియార్డు డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వరరావు, ఇంద్ర, ఎస్సీ సెల్ నాయకులు కలిసెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-దాచేపల్లి

స్థానిక యుటిఎఫ్ ఆఫీసు లో యుటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. అదే కార్యక్రమంలో పాకెట్ క్యాలెండర్ కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు పి.రాజారావు, ప్రధాన కార్యదర్శి ఆనంద్, కోశాధికారి జీవి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు ఎన్ని ఏసయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు వి.వెంకట్రావు, మోజే సాయిబాబా, సిపిఎం సిపిఎస్ కమిటి అధ్యక్షుడు డి.కొండలు, కె.విజయ్ కుమార్, వేణుగోపాలరావు, సాగర్ బాబు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశకి-చిలకలూరిపేట

రోటరీ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షు లు కాపు వెంకట రావు అమ్మమ్మ గింజుపల్లి హనుమాన్యమ్మ జ్ఞాపకార్థం పట్టణంలోని మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం లోనే ఇతర రంగాల సేవల కన్నా పారిశుద్ధ సేవ మిన్న అన్నారు. అనంతరం క్లబ్ ట్రైనర్ తోటకూర వెంకటనారాయణ మాట్లాడారు. మరో ముఖ్యఅతిథి మునిసిపల్ కమిషనర్ గోవిందరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవ అభినందనీయమని కరోనా సమయంలో కూడా సేవలు చేస్తూ ప్రజల మన్ననలను పొందరన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఆళ్ల వేమన రెడ్డి క్లబ్ డైరెక్టర్లు కె.శివరావు, జి.సాంబశివరావు, పి.శ్రీనివాసరావు, టి.యశ్వంత్‌రెడ్డి, జి.నాగేశ్వరరావు, కె.శివప్రసాద్, కె.వెంకట కోటేశ్వరరావు , హెచ్.శ్రీనివాసరావు, వివేకానంద సమితి సభ్యులు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు.



గీతాంజలి స్కూల్స్‌లో ఫ్యాషన్ షో

ప్రజాశక్తి-వినుకొండ

గీతాంజలి స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గీతాంజలి విద్యా సంస్థల డైరెక్టర్ యేండ్లూరి శేషగిరి రావు మాట్లాడుతూ చిన్నారులు వివిధ ప్రదేశాల వస్త్ర ధారణలు తెలుసుకోవాలి అనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే చిన్నారులు శుభ్రమైన దుస్తులు ధరిస్తే వారు ఎంత చక్కగా, అందంగా కనబడతారో ఈ ఫ్యాషన్ షో ద్వారా వారికి వివరించారు. చిన్నారులు రాంప్ పై క్యాట్ వాక్ చేస్తూ మ్యూజిక్‌నకు అనుగుణంగా స్టెప్స్ వేస్తూ చేసిన ప్రదర్శనలు వచ్చిన వారిని కట్టిపడేశాయి. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ తెళ్ళ కష్ణవేణి, కరెస్పాండంట్ ఎండ్లూరి లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి విధానం రివర్స్‌లో...



అమరావతిలో..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయం వద్ద చేస్తున్న నిరసన కార్యక్రమం శనివారం నాటికి 19వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా పట్టణ, గ్రామాల్లో ఉన్న అన్ని వార్డు,గ్రామ సచివాలయాల్లో ఉన్న కార్యదర్శికి సమస్యల పరిష్కారానికి సంబంధించన వినతిపత్రం ఇచ్చారు. అనంతరం దీక్ష శిబిరం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు జి.సావిత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ జీతాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తానని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి మాట తప్పారని విమర్శించారు. ముఖ్యమంత్రి విధానం రివర్స్‌లో ఉంది కనుక సాయంత్రం స్థానిక శిబిరం వద్ద నుంచి ఎన్నార్టీ సెంటర్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు అంగన్వాడీలు వెనక్కి నడుచుకుంటూ వెళ్లి నిరసన తెలిపారు. మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విల్సన్,ఆటో అండ్ ట్రాలి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు పల్లె పోగు రాజు పాల్గొని వారి పూర్తి మద్దతు ప్రకటించారు. ఎ.పద్మావతి, జి.పద్మావతి, అమృత కుమారి, డి.సుబ్బలక్ష్మి, మనీ, మేరీ,బి వెంకట రావమ్మ,ఎం.జ్యోతి, అరుణ, అంగన్వాడీలు, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరు సచివాలయ వన్ టు కార్యదర్శి రాఘవయ్య రమేష్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.రమాదేవి, విజయలక్ష్మి, మాధవి,కె.విజయలక్ష్మి, అంజమ్మ,లక్ష్మి, ఖాదరున్, కె.సీతామాలక్ష్మి, శారద పాల్గొన్నారు

ప్రజాశక్తి-క్రోసూరు

మండలం కేంద్రంలోని సచివాలయాల సెక్రటరీలకు అంగన్వాడీల సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా క్రోసూరు సచివాలయ సెక్రటరీ పంతుల్లు నాయక్‌తో అంగన్వాడీలు మాట్లాడుతూ న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్వాడీలతో సంతకాలు సేకరించి సచివాలయం-1, సచివాలయం-2 కార్యదర్శి రమీజ్‌కి వినతి పత్రాలు అందజేశారు.



వినుకొండలో..

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అంగన్వాడీలు తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సచివాలయ కార్యదర్శులకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. పట్టణంలోని 17వ సచివాలయం, శ్రీనివాస్ కాలనీలో, బిఆర్‌జెసి సచి వాలయం, శివాలయం శివాలయం దగ్గర సచివాలయం మాచవరం మండల కేంద్రం సచివాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చారు.వినతి పత్రం అందజేసిన వారిలో డి.శాంతమని, సువర్ణ , రాణి, శోభారాణి , విజయరాణి,అరుణ, బుజ్జి, మాచవరం సచివాలయంలో రాధిక, భవాని, తదితరులు వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లిటౌన్

సిఐటియు మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అంగన్వాడీ సిబ్బంది పట్ల జగన్ ప్రభుత్వం కక్షపూర్వకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ముందుగా శిబిరాన్ని సిఐటియు నాయకులు పి.మహేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష , కార్యదర్శులు జి.సుజాత, ఎం.అహల్య, సెక్టార్ లీడర్స్ చాముండేశ్వరి, ధనలక్ష్మి, దుర్గాభవాని, అంజలీ తదితరులు పాల్గొన్నారు .

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు రాయల శ్రీనివాసరావు పాలొని సంఘీభావం తెలిపారు. వెన్న పూసవాగులోని అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం, డిపార్ట్మెంట్ వాళ్ళ చేత పని చేయిస్తామనడం సబబు కాదని అన్నారు. అనంతర సచి వాలయాల వద్దకు అడ్మిన్స్ కి తమ సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్ర సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు హనుమంతరెడ్డి, ఎఐటి యుసి జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, ఎ.ఆంజనేయులు బి.కోటయ్య ,అంగన్వాడీ జిల్లా కోశాధికారి ఎఎల్ . ప్రసన్నకుమారి, సెక్టార్ లీడర్లు మున్ని, విజయ కుమారి, పి.ఉమాశంకరి, కృష్ణకుమారి, నాగజ్యోతి, డి. బీబులు, నిర్మల, శ్రీదేవి, తిరుమలదేవి, మధ్యాహ్న భోజనం అధ్యక్షురాలు తిరుమల లక్ష్మి పాల్గొని నిరసన తెలిపారు.

ప్రజాశక్తి-అమరావతి


న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం, బుద్ధుని బొమ్మ ఎదురుగా అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు, సిఐటియు నాయకులు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో..



క్రోసూరులో..



పిడుగురాళ్లలో..



నాదెండ్లలో..



సత్తెనపల్లిలో..



మాచర్లలో..

ప్రజాశక్తి-మాచర్ల

13వ వార్డు సచివాలయం ముందు అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు సచివాలయం కార్యదర్శి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండ్ల మహేష్ అంగన్వాడీ యూనియన్ నేతలు ఉషారాణి, కోటేశ్వరి, శివకుమారి, ఇందిర పాల్గొన్నారు

ఎన్టీఆర్ కళాక్షేత్రంలో చేనేత హస్త కళల ప్రదర్శన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడే విధంగా చేనేత హస్త కళలు ఉట్టిపడుతున్నాయని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో చేనేత కళల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు కిషోర్ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత ప్రధానమైన వత్తిగా ఉన్న ప్రపంచ దేశాలు అబ్బురపరిచే విధంగా హస్త కళాకారులు ఎంతోమంది ఉన్నారని అన్నారు.వారు ఉపాధి కరువై, జీవనోపాధి కోల్పోవడం విచారకరమని అన్నారు. ఈ నేపథ్యంలో 'మనం బ్రతుకుతూ 10 మందిని బ్రతికించుదాం'అనే సంకల్పంతో హస్త కళాకారుల సంక్షేమం కోసం, నిరుద్యోగం,దివ్యాంగుల శ్రేయస్సు కోసం, వారి జీవనోపాధి కోసం ప్రభుత్వాలపై ఆధారపడకుండా, నిరుద్యోగులుగా మిగిలిపోకుండా సమాజ శ్రేయస్సు కోసం దాదాపు 100 మంది కళాకారులు స్వయం సహాయక సంఘం గా ఏర్పడి "శ్రీ ఉషోదయ సొసైటీగా ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. ఆ కళాకారులు తయారు చేసిన హస్తకళలే ఇక్కడ ప్రజల కోసం ప్రదర్శన ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మా ఈ ఏర్పాటును సత్తెనపల్లి పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



చేనేత కళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి

కేన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

కేన్సర్ వ్యాధితో పోరాడుతున్న పెదకూరపాడు గ్రామానికి చెందిన గోగులపాటి కన్నయ్యకు మాజీ ఎమ్మెల్యే, పెదకూరపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ బాసటగా నిలిచారు. శనివారం మాజీ ఎమ్మెల్యే రూ.25,000, పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్, 10000), గుడిపూడి చిన్నరాజు(10000), అంద్ర ప్రసాద్(5,000) రామినేని రాజ(5,000), కష్ణంనేని చిన్న(5,000)లు మొత్తం రూ.60 వేలను నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు.



గొంతెమ్మ కోర్కెలు కాదు...ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కార్మికులకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గత ఐదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరవధిక సమ్మె గుంటూరులో కొనసాగుతుంది. కార్మికుల సమ్మెకు రోజు రోజుకు మద్దతు పెరుగుతుంది. శనివారం టిడిపి గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ నజీర్ అహ్మద్, రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమాజంలో ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్నారని, అలాంటి వారికి ఆదాయ పరిమితి లేకుండా సంక్షేమ పథకాలు కొనసాగించాలని అన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సిఎం ఇచ్చిన హామీలు తప్ప కొత్త డిమాండ్లు ఏవీ చేయట్లేదన్నారు. వెంటనే మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేదంటే తమ పార్టీ ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకుంటుందని హెచ్చరించారు. రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు చేస్తుంది న్యాయపోరా టమని, వారి పోరాటానికి ఆర్‌పిఐ (అంబేద్కర్) సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఇంజినీరింగ్ విభాగం కన్వీనర్ పి. శ్రీనివాసరావు, నాయకులు పాశం పూర్ణచంద్రరావు, కె.మరియదాసు, రామకష్ణ, జి శ్రీనివాసరావు, జి. ప్రసాదరావు, కుంభా శివయ్య, కాళంగి భాగ్యరాజు, కారశాల శౌరమ్మ, ఏటుకూరి రోశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

మున్సిపల్ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం ముందు శనివారం కార్మికులు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రశాంతంగా సమ్మె కొనసాగుతుండగా అక్కడక్కడ పోటీ కార్మికులను దింపి అధికారులు ఉద్రిక్తత పరిస్థితులకు కారణమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి పట్టణంలో రెండు ప్రాంతాల్లో పని చేయడానికి వచ్చిన పోటీ కార్మికులకు నాయకులు నచ్చజెప్పి వెనక్కి పంపించారు. కార్మికులు అందరూ ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. డిమాండ్లను సాధించేంత వరకు పోరాటం కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.కృష్ణ, డి.విజయబాబు, డివి భాస్కరరెడ్డి, కె.బాబూరావు, వెంగమ్మ, నాగమణి, రాంబాబు, వేణు, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి


మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి ఐదో రోజు చేరింది. మంగళగిరిలో 5వ రోజు మున్సిపల్ కార్మికులు నల్ల దుస్తులను ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వివి జవహర్లాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే స్పందించి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, యూనియన్ నాయకులు కే ఏసు, వై శివ నాగేశ్వరావు, ఎం శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళగిరిలో మున్సిపల్ కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమస్యలను పరిష్కారం చేయకపోతే జనవరి మూడో తేదీ నుండి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి దుర్గారావు, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


గుంటూరులో సమ్మెలో పాల్గొన్న కార్మికులు


తాడేపల్లిలో


మంగళగిరిలో




మెడకు ఉరి తాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో మున్సిపల్ కార్మికులు మెడకు ఉరి తాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులు కొత్తగా గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అన్ని విభాగాలలోని కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, చనిపోయిన కార్మికుని స్థానంలో వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, 62 ఏళ్లకు పదవి విరమణగా పరిగణిస్తున్న ప్రభుత్వం వారికి పెన్షన్ సౌకర్యం, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం రకరకాలుగా కుట్రలు పన్నుతోందని, ఎన్ని అడ్డంకులు సష్టించినా సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

5వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి- మంగళగిరిరూరల్

మండలం లోని ఎర్రబాలెం గ్రామంలో మున్సిపల్ కార్మికులు శనివారం నల్ల బట్టలు ధరించి నిరసనకు దిగారు. సమ్మెకు మద్దతు మంగళగిరి నియోజకవర్గ టిడిపి నేతలు మద్దతు తెలిపారు. రాజధాని ప్రాంత మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం రవి ఈ నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల మున్సిపల్ కార్మికుల సమ్మె ఐదవ రోజుకి చేరుకోవడంతో గ్రామాల్లో, వార్డుల్లో చెత్త పేరుకుపోయి మురికి కుపాలుగా మారిపోయాయని పేర్కొన్నారు. అంటు రోగాలు ప్రబలక ముందే, ప్రజారోగ్యాలను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా ఈప్పటికైనా మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన మాట తప్పిందనిఅన్నారు. మున్సిపల్ కార్మికులను దేవుళ్ల నీ పొగిడి వీరికి లక్ష రూపాయలు ఇచ్చిన తక్కువే అని చెప్పిన ముఖ్యమంత్రి తను నివసిస్తున్న ఎం టి ఎం సి కార్పొరేషన్ లోని విలీన గ్రామాల కార్మికులకు మున్సిపల్ అధికారులు కేవలం 12 వేల రూపాయల జీతం చెల్లించడం అన్యాయం కాదా అని ప్రశ్నించారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వారి ఆరోగ్యాలను ఫణంగా పెట్టి, పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్న కార్మికుల కు జీవో ప్రకారం కూడా జీతాలు చెల్లించకుండా వారి కడుపులు కాల్చడం దుర్మార్గమని అన్నారు. ఏంటి ఎంసీలో విలీనమైన ఉండవల్లి, ఎర్రబాలెం గ్రామాల పారిశుధ్య కార్మికు లు పంచాయతీలుగా ఉన్నప్పుడు రూ.15 వేల జీతం తీసుకున్నారని, కార్పొరేషన్ లో విలీనం అయిన తర్వాత జీతం పెరగాల్సింది పోయి, వీరికి ఉన్న జీతం తగ్గించి 12 వేల రూపాయలు మాత్రమే ఇస్తూ, వీరి శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. సమ్మెలో ఉన్న మున్సిపల్ కార్మికులకు తెలుగుదేశం నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు , నీలం అంకారావు, కర్నాటి సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ బాబు, ఓ రామారావు, టీ.ఆదిలక్ష్మి కే కోటేశ్వరి, ఎన్ దివ్య, ఎం పార్వతి, యు ఏడుకొండలు, కుంభ గోపి, జి మేరీ, ఎన్ సుజాత తదితరులు నాయకత్వం వహించారు. మండలంలోని కాజా గ్రామంలో పారిశుధ్య కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా విధులు బహిష్కరించి దీక్షలు చేపట్టారు. శనివారం కుటుంబ సభ్యులతో, నల్ల బట్టలు ధరించి దీక్షలు చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సి ఐ టి యు నేతలు బి. కోటేశ్వరి, మాధవ రెడ్డి, సత్యమారెడ్డి, రామయ్య, డి. శ్రీనివాసరావు, నాగేంద్ర బాబు, బుజ్జీ, వెంకట్, క్రాంతి, రమణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.


ఎర్రబాలెంలో నల్ల దుస్తులు ధరించి నిరసన

మున్సిపల్ కార్మికుల సమ్మెపై నాయకులతో కమిషనర్ చర్చ

ప్రజాశక్తి-తెనాలి

మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించి సహకరించాలని కమిషనర్ ఎం.జస్వంతరావు కార్మిక సంఘ నాయకులను కోరారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్‌వలి, జిల్లా కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లుతో కమిషనర్ చర్చలు జరిపారు. కొన్ని మున్సిపాలిటీల్లో సమ్మె జరగటంలేదని, ప్రభుత్వం కార్మికులకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేసినా అమలు చేస్తామని, సమ్మె విరమించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంతవరకూ సమ్మె విరమించేదిలేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు కార్మికులతో పారిశుధ్యం నిర్వహిస్తామని, అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా, రెచ్చగొట్టే ధోరణిలో ప్రైవేటు కార్మికులను ప్రోత్సహిస్తే సహించబోమని స్పష్టం చేసినట్లు నాయకులు తెలిపారు.


ఏఎన్ఎంల సమావేశంలో పాల్గొన్న వై నేతాజీ

ఆరోగ్య కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి -కొల్లిపర

గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ కార్య దర్శులపై అధిక పని భారం మోపుతున్నారని రోజు రోజుకి ఒక కొత్త యాప్‌తో మానసిక ఒత్తిడి పెరుగుతుందని ఏపీ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై నేతాజీ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కొల్లిపరలో గ్రామ సెక్రటరీ సంఘం అధ్యక్షులు జే హేమలత అధ్యక్షతన జరిగిన హెల్త్ సెక్రటరీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వము పోస్టుల నియామకం సందర్భంగా బి గ్రేడ్ చేసి తక్కువ బేసిక్ పే నిర్ణయించి అన్యాయం చేసిందని ప్రమోషన్ ఛానల్ లేకుండా నిలిపివేసిందని నేతాజీ తెలిపారు. గతంలో మెల్ హెల్త్ సెక్రటరీల సహకారం ఏఎన్ఎం లకు ఉండేదని ప్రస్తుతం సెక్రటరీలు అందరినీ ఇతర పనులకు వినియోగించడం వలన ఏఎన్ఎం లకు సహకారం లభించక పని భారం ఒత్తిడి పెరిగిందన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, ఎన్ఎంలు పాల్గొన్నారు. వార్డు హెల్త్ వెల్ఫేర్ అసోసియేషన్ కొల్లిపర మండలంలోని మున్నంగి పిహెచ్‌సి కమిటీ ఎన్నిక జరిగినది . అధ్యక్షులుగా జె హేమలత కార్యదర్శిగా పి కుసుమ, కోశాధికారి డి అనిత ప్రియదర్శిని ఎన్నుకున్నారు.


రైతు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు, సాంబిరెడ్డి తదితరులు

2024 రైతు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రైతులు ఐక్యంగా ఉద్యమించడం ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలు తిప్పికొట్టగలమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు అన్నారు. స్థానిక చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో తెనాలి కమిటి ఆధ్వర్యంలో ప్రచురించిన 2024 రైతు క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల స్మార్ట్ మీటర్లను రైతులకు అమరుస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే డిజిటల్ మీటర్ల అమరికను ప్రైవేటీకరణ చేయడం వెనుక కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాన్ని రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇందులో భాగంగానే రైతులు నష్టపోయిన పంటపొలాలకు గాను ప్రకటించిన అంచనా విలువ రూ 6850 వేలు ఏమాత్రం సరిపోదన్నారు. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం సి2 ప్లస్ 50 చట్టం ద్వారా మద్దతు ధర ప్రకటించకపోతే రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కునే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరా వరి పంటకు రూ 25 వేలు, వాణిజ్యపంటలకు రూ 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ద్వారా మోడీ ప్రకటించిన ముఖ్యమైన రైతు హామీలను నెరవేర్చాలన్నారు. లేదంటే ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పెరేడ్ మాదిరిగా రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ట్రాక్టర్లతో సంయుక్త కిసాన్ ప్రచారం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, తెనాలి అధ్యక్షుడు ముద్దన సాంబశివరావు, కొత్త రమేష్ బాబు, తులాబందుల శ్రీనివాసరావు, వెలగా ఆదినారాయణ, ములకా శివకుమారి, మాగంటి యలమందయ్య తదితరులు పాల్గున్నారు

మున్సిపల్ కార్మికులపై చిన్నచూపు.. సిగ్గుచేటు

ప్రజాశక్తి - నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో శనివారానికి 5వ రోజుకు చేరింది. ఈ సమ్మెలో మునిసిపాలిటీలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.సల్మాన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను చిన్న చూపు చూస్తుందని, ఈ విధంగా చేయడం ప్రభుత్వానికి సిగ్గు చేటని విమర్శించారు. కెఎంపిఎస్ రాష్ట్ర కార్యదర్శి కందిమల్ల కృష్ణ పాల్గొని మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల కోరుతున్న అన్ని డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చకపోవటం ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వక పోవడం కార్మికులను చిన్న చూపు చూడటమే అవుతుందన్నారు. పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు కంబాల ఏడుకొండలు పాల్గొని మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలియజేశారు.ఈ సమ్మెలో మునిసిపల్ కార్మికులు యోహాను, మల్లయ్య, శేఖర్, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

శిబిరం వద్దే కార్మికులు వంట వార్పును చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ సహాయ కార్యదర్శి జె రాజకుమార్ మాట్లాడుతూ 2019 లో జగన్ పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తేఆరు నెలల్లోనే మున్సిపల్ కాంట్రాక్టు ఔటసోర్సింగ్ కార్మికులను అందరిని సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తాం అని హామీ ఇచ్చి అధికారం చేపట్టి 5ఏళ్ళు పూర్తి కావస్తున్న నేటికీ హామీలు అమలకు నోచుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల అధ్యక్షులు చింతగుంట వెంకయ్య , వి శ్రీను, సునీత, కోటేశ్వరరావు , రవి, నాగమణి తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి-దాచేపల్లి

స్థానిక కొట్లబజార్‌లో కార్మికులు ర్యాలీ నిర్వహించి టాఫిక్‌ను ఆపారు. డి వై యఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు ఈ కార్యక్రమం లో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని , కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని , కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు కారాలపాటి జాని మాట్లాడుతూ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న సఫాయి కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యలనుపరిష్కరించాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికుల పిడుగురాళ్ల లో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. జానపాడు రోడ్డు నుండి బ్యాంక్ సెంటర్ , సినిమాలు సెంటర్ నుండి ఐలాండ్ సెంటర్ వరకు కార్మికులు భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్య దర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లా డారు. ఈ ప్రదర్శనలో పారిశుద్ధ్య కార్మి కులు కె.సీతారామయ్య ,కొండలు , రామారావు , ప్రతాపు, పరమేశ్వరరావు, సురేంద్ర, శ్యాం కోటి, వెంకటేశ్వర్లు , నాగేంద్రబాబు కంప వీరమ్మ, దేవరకొండ లక్ష్మి, సుజాత , అనంతలక్ష్మి, మార్తమ్మ, అరుణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వినుకొండ

మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐపియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ వద్ద నుండి శివయ్య స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్ని పాలిటిలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని లేని పక్షంలో జనవరి 3 నుండి మున్సిపల్ కార్మికు లందరూ సమ్మెలోకి వెళ్ళనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సి పల్ వర్కర్ సీనియర్ నాయకులు సం పెంగుల రాజు, రాసిపూడి ఏసు పాదం, కంచర్ల కోటేశ్వరావు, సాయి, దేవమ్మ, ఆలి సమ్మ, నాగరాణి, సరోజమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్‌కు పారిశుద్ధ్య కార్మికులు వినతి పత్రం అందజేశారు. సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.మహేష్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయకుమార్, రమణ, అనసూర్య పాల్గొన్నారు. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి , సిటియు సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ కార్యా లయం ముందు నిరసన తెలిపారు. కమిషనర్ రమణబాబుకు వినతిపత్రం అందజేశారు.అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సి టి యు నాయకులు అబ్రహం లింకన్ ఏఐటీయూసీ నాయకులు బాబురావు ప్రజాసంఘాల నాయకులు రూబేను దాని యేలు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు



నరసరావుపేటలో..



సత్తెనపల్లిలో వంటవార్పులో భోజనాలు చేస్తున్న కార్మికులు..



పిడుగురాళ్లలో పారిశుద్ధ్య కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



వినుకొండలో..



మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



ఏపీ ఎన్జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -అమరావతి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ 2024 టేబుల్ క్యాలెండర్‌ను తహశీల్దార్ విజయశ్రీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను తర్వాత గతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిటి సునీత, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ పుస్తకాలు

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక శాఖా గ్రంథాలయంలయం, సంతగుడిపాడు గ్రంథాలయం లో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాధికారి జి.సుబ్బారావు శనివారం తెలిపారు. గుంటూరు జిల్లా గ్రం థాలయ సంస్థ వారు రెండు రోజుల క్రితం ఈ పుస్తకాలు పంపించారని అన్నారు. ప్రభుత్వ రంగ ఉద్యోగములు, గ్రూపుబి1, 2 ఉద్యోగాలు, పోటీ పరీక్షల కొరకు వ్రాసే అభ్యర్థులకు ఈ పుస్తకాలు నిత్యం అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ అవకాశమును గ్రామంతో పాటు పరిసర గ్రామస్థులు సద్వినియోగము చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ లో సత్తా చాటిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు

దక్షిణ భారత సైన్సు ఫెయిర్‌కు ఎంపిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



అంకమయ్యను సత్కరిస్తున్న ఎస్‌సిఇఆర్‌టి ప్రతాప్ రెడ్డి

దక్షిణ భారత దేశ సైన్స్ ఫెయిర్ కు పల్నాడు ఉపాధ్యాయుడు రూపొందించిన మోడరన్ స్ట్రీట్ లైట్ పోల్స్ ఎగ్జి బిట్ ఎంపికైనట్లు పల్నాడు జిల్లా సైన్స్ అధికారి ఎఎ మధుకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 ,29 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లా మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ లో ఉపాధ్యాయ విభాగంలో పల్నాడు జిల్లా మాచవరం మండ లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపా ధ్యాయుడు దావల అంకమయ్య రూపొందించిన మోడరన్ స్ట్రీట్ లైట్ పోల్స్ ఎగ్జిబిట్ ఉత్తమ రూపకల్పనగా నిలిచి బహుమతి సాధించారు. అంకమయ్యను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ అభినం దించినట్లు మధు కుమార్ పేర్కొన్నారు. మాచవరం జిల్లా పరిషత్ హైస్కూలు ప్రధానో పాధ్యాయులు కె ఎస్ ఎస్ సురేష్ బాబు, తోటి ఉపాధ్యాయులు అంకమయ్యకు అభినంద నలు తెలిపారు.

ఓవర్ బ్రిడ్జి వద్దు అండర్పాస్ కావాలని వినతి

ప్రజాశక్తి-దాచేపల్లి

దాచేపల్లి మండలంలోని కేసనపల్లి గ్రామం వద్ద ఉన్న రైల్వే గేట్ ఓవర్ బ్రిడ్జి వద్దు రైల్వే అండర్ పాస్ నిర్మించాలని గ్రామ ప్రజలు నిరసన తెలియజేశారు.. గ్రామ ప్రజలు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించడం వలన అక్కడ దగ్గర్లోని రెండు పాఠశాలలు ఉన్నాయి ఆ పాఠశాలను 108 విద్యార్థులు ఉన్నారు వాళ్ళు ఇబ్బందులకు గురవుతారు అని అన్నారు... ఈ సమస్యపై కేసనపల్లి గ్రామ ప్రజలు ఎమ్మార్వో వినతిపత్రం అందజేశారు.

పథకాల అమలు తీరుపై సమీక్ష

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పథకాల తీరుపై జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం లు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు, పలువురు తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మండల కో- ఆర్డినేటర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు,మండల అధికారులు పాల్గొన్నారు. రేపటి నుండి పెన్షన్ రూ 250 రూపాయలు పెరగనున్న నేపథ్యంలో జనవరి 3 నుంచి 8 వ తారీకు వరకు గ్రామాలు, మండలాలు, జిల్లా స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైయస్సార్ ఆసరా జనవరి 23 వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో 17 నుంచి ప్రజల్లో అవగాహన, ముందస్తు ఏర్పాట్లు, సక్సెస్ స్టోరీలు, ఫోటోలను వేయించాలన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్స్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్ గోదాము భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. గురువారం మార్కెట్ యార్డులోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరేంద్ర ప్రసాద్ తో కలిసి శనివారం పరిశీలించారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న దష్ట్యా గోదాము భద్రతకు చేసిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను కొనసాగించేలా చూడాలన్నారు.



నెల నెలా సాహిత్య మేళా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాటి చరిత్రను కవి సార్వభౌమ కవిత రూపంలో రూపంలో పలికించిన తీరు భేష్ అని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. స్థానిక ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాల్ లో శనివారం నెల నెలా సాహిత్య మేళా కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ,జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. భాగంగా కవి సార్వభౌమ శ్రీనాథ మహాకవి సూక్తి - వైచిత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. కవి సార్వభౌమ శ్రీ నాథుడు వారసుడు కావూరి శ్రీనివాస శర్మ ను కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

ప్రముఖ డప్పు కళాకారుడు రవి మృతి

ప్రజాశక్తి-తెనాలి



ప్రముఖ డప్పు వాయిద్య కళాకారుడు బీసిపోగు రవిబాబు (60) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన రవిబాబు ఒకవైపు డప్పు కళాకారునిగా, మరోవైపు చర్మకారుడిగాను రాణించారు. డప్పు కళాకారునిగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆయన టిడిపి హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుంచి ఉగాది సందర్భంగా తెలుగు తల్లి పురస్కారాన్ని కూడా అందుకున్నారు. డప్పు కళ అంతరించి పోకూడదని రవిబాబు ఎంతో శ్రమించారు. కొలకలూరు పరిసర ప్రాంతాలకు చెందిన ఎంతోమందిని డప్పు కళాకారులుగా తీర్చిదిద్దారు. ఆయన మృతి పట్ల పలువురు కళాకారులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామంలో శనివారం ఆయన అంత్యక్రియలు ముగించారు.



నిరసనలో పాల్గొన్న బిసి సంఘం నాయకులు

తక్షణమే రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

ప్రజాశక్తి-గుంటూరు

కులగణన చేయకుండా తేదీలు మారుస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీలను మోసం చేస్తున్నాడని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ విమర్శించారు. తక్షణమే కులగణన చేయాలని కోరుతూ స్థానిక అమరావతి రోడ్డులోని బిపి మండల్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించి, నిరసన కార్యక్రమం నిర్వహిచంచారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులగణన అప్పుడు చేస్తాం.. ఇప్పుడు చేస్తాం.. అని టెలిఫోన్ నంబర్లు చెబుతున్నట్లు తేదీలు ఇస్తున్నారన్నారు. కార్యాచరణలో ముందుకు పోవట్లేదన్నారు. వైసిపికి బిసిలు బ్యాక్ బోన్ అని చెప్పుకుంటూ మొదటి నుండి బిసిల వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నారన్నారు. బీజేపీకి రాష్ట్ర ప్రభుత్వం తొత్తుగా మారి కులగణన చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కళ్ళుతెరిచి తక్షణమే కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వర రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీనివాస్, రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమం తరావు, బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షులు కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేష్ రావి

ఆర్‌విఆర్‌లో వికసిత్ భారత్ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థుల అద్భుత ఆలోచనలను కార్యరూపం దాల్చుతూ, దేశాభివద్ధిలో యువతను భాగస్వాములను చేయడానికి ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన బహత్తర కార్యక్రమం వికసిత్ భారత్ అని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. మోడీ ఇటీవల ప్రారంభించిన వికసిత్‌భారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం ఆర్‌విఆర్‌లో 'బిల్డింగ్ టుమారో: స్ట్రాటజిక్ ఇంసైట్స్ ఫర్ డెవలప్మెంట్ ఇన్ విక్సిత్ భారత్ బై 2047 ' అనే పేరుతో సెమినార్ నిర్వహించారు.పారిశ్రామిక వేత్త రమేష్ రావి మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 కార్యక్రమ ఉద్దేశాన్ని, ప్రయోజనాన్ని వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుండి కేంద్రం వరకు విద్యార్థుల విజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు వికసిత్ భారత్ నిర్వమిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకష్ణ, కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కష్ణప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు నిత్య విద్యార్థులు

- హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న న్యాయమూర్తి శేషసాయి

న్యాయవాదులు నిత్యవిద్యార్థులు అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి అన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్, జెసి న్యాయ కళాశాల, ఏసి న్యాయ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గుంటూరు మెడికల్ కళాశాల ఆవరణలోని జింఖానా ఆడిటోరియంలో న్యాయ శాస్త్రంపై శనివారం సెమినార్ నిర్వహించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఘంటా రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ న్యాయవాద వత్తిలో రాణించాలంటే యువ న్యాయవాదులు తనకున్న న్యాయ పరిజ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవడం, తనకు కావలసిన పరిజ్ఞానాన్ని ఇతరుల నుంచి తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. గుంటూరు బార్ అసోసియేషన్ నుంచి ఎంతోమంది ఉద్దండులైన న్యాయవాదులు ఉన్నారని చెప్పారు. యువ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు బార్‌అసోసియేషన్ చొరవ తీసుకుంటే న్యాయ వ్యవస్థకు మంచి న్యాయమూర్తులు అందు తారని చెప్పారు. ముఖ్య అతిథి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి పార్థసారథి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ వల్ల న్యాయవాద వత్తిలో అభివద్ధి ఉంటుందని భావించే వారమని, అయితే ఆచరణలో దానికి పూర్తి విరుద్ధంగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమయాభావం వల్ల సీనియర్ న్యాయవాదులు జూని యర్ న్యాయవాదులకు డ్రాఫ్టింగ్ మెళుకువలు నేర్పటం లేదని కంప్యూటర్ ద్వారా సులువైన పద్ధతిలో దావాలు పిటిషన్లు తయారు చేయడానికి మొగ్గుచూపుతున్నారని చెప్పారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఏ.రామిరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు నివారించేందుకు న్యాయ వాదులకు రక్షణ చట్టం కావాలని ఎంతోకాలంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నామని చెప్పారు. న్యాయవాదులకు కనీసమైన వస్తువులు కూడా లేవని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాళ్ల మాధవి సోమసాని బ్రహ్మానందరెడ్డి వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, వజ్జా శ్రీనివాసరావు, జెసి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, ఏసిలా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎలీషా తదితరులు ప్రసంగించారు. అనంతరం జరిగిన సెమినార్లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవి శేషసాయి సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని పలు సెక్షన్లను, ఇంటర్లాక్యుటరీ పిటిషన్లను, పలు నిబంధనలను వివరించారు. మరో హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లో పలు సెక్షన్లు హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పుతో వివరించగా, మరో హై కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్ చక్రవర్తి ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ గురించి వివరించారు. ఈ సెమినార్ లో పలువురు న్యాయ మూర్తులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయ వాదులు, న్యాయ శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు

బిఎస్ఎన్ఎల్ ఫోన్ సిగ్నల్స్ పెంచండి

ఎంపి కృష్ణదేవరాయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ప్రైవేటు నెట్ వర్కులతో పోటీ పడాలని, సిగ్నల్ వ్యవస్థను మెరుగుపర్చాలని, టవర్‌ల సంఖ గణనీయంగా పెంచాలని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు బిఎస్ఎన్ఎల్ అధికారు లను కోరారు. శనివారం గుంటూరు జిల్లా 3వ టెలిఫోన్ అడ్వైజరీ కమిటి సమావేశానికి శ్రీకృష్ణ దేవరాయలు అధ్యక్షత వహించారు. సమస్యలను పరిష్కారించుకుని బిఎస్ఎన్ఎల్ ను అభివద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్లే ప్రణాళికలతో అధికారులు కషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. మరిన్ని బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ టవర్ లు పెంచి నెట్వర్క్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. పల్నాడులో సిగ్నల్స్ పెరిగేలా మరింత దష్టి సారించాలన్నారు. సిగ్నల్ సామర్థ్యం పెంచితేనే ప్రజలకు ఈ నెట్వర్క్ పై నమ్మకం కలుగుతుందన్నారు. సమస్యలు తెలిపితే కేంద్రం వద్ద తన వంతు కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 729 టవర్ లలో 104 మాత్రమే 4జి సర్వీస్ గా ఉండటం పట్ల అసంతప్తి వ్యక్తం చేశారు. అన్ని టవర్ లు 4జిగా మారేలా చూడాలని, అదనపు టవర్ లు ఏర్పాటు ప్రణాళికలు అందించాలన్నారు. కేంద్రం బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ అభివృద్ధికి దేశ వ్యాప్తంగా రూ. 89,000 కోట్లని మంజూరు చేసి ప్రోత్సాహం ఇస్తుంటే.. అధికారులు ఎందుకు అభివద్ధి బాటలో ఉండటం లేదని ఎంపి ప్రశ్నించారు. మహరాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఎక్కువగా నిధులు వాడుకొని బిఎస్ఎన్ ఎల్ ను అభివృద్ధి చేసుకుంటుటే మన రాష్టాల్లో వెనుకబాటు లోనే ఉంటున్నామని అన్నారు. గ్రామాల్లో ఇళ్ల మధ్య టవర్ పెట్టడం ఇబ్బందిగా ఉంటే.. ప్రభుత్వ బిల్డింగ్ లు, గ్రామ సచివాలయాలు, ఆర్బికెలు, పిహెచ్ సి, స్కూల్స్ బిల్డింగ్ ల పైన పెట్టాలని సూచించారు. సీనియర్ సభ్యుడు, జర్నలిస్టు నిమ్మరాజు చలపతి రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన గుంటూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కస్టమర్ కేర్ సెంటర్ల నుంచి సరైన సమాధానం లభించడం లేదన్నారు. రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గుంటూరు జనరల్ మేనేజర్ శ్రీధర్, డిజిఎం ప్లానింగ్ శ్యామ్ ప్రసాద్,డిజిఎం ఆపరేషన్స్ వెంకటేశ్వరరావు,అడ్వైసరీ కమిటీ మెంబెర్స్ కోటేశ్వర రావు, రవీంద్ర రెడ్డి, ఉదయ భాస్కర్, కాకర్ల వెంకటేశ్వర్ రావు, కే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వికలాంగులను తక్కువ అంచనా వేయొద్దు

ప్రజాశక్తి-గుంటూరు : దివ్యాంగులను తక్కువ అంచనా వేయరాదని, దివ్యాంగులు తమ ప్రతిభతో వివిధ రంగాల్లో రాణించి ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి దర్మచరణ్ తెలిపారు. శనివారం స్థానిక స్వర్ణ భారతి నగర్‌లోని దాక్షిణ్య దివ్యాంగుల శిక్షణా సంస్థ 28వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వికలాంగులకు కూడా ఇతరుల వలే సమానావాకాశాలు కల్పించాలని, ముఖ్యంగా మెరుగైన జీవనానికి అవసరం అయిన విద్యా, ఉపాధి, ఆరోగ్యం, సంరక్షణ, సాంకేతిక రంగాల్లో వారికి అవకాశాలు ఉండాలన్నారు. దాక్షిణ్య ఫౌండర్ డాక్టర్ టీవీ రావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా దివ్యాంగులకు అన్ని సదుపాయాలు సమకుర్చేందుకే ఈ సంస్థను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గుంటూరు రూరల్ మండలాలకు చెందిన నలుగురు దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్స్ ను, శ్రీ శారదా నికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 15 బెంచీలను అందచేశారు. కార్యక్రమంలో టోబాకో బోర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ విల్సన్, జనచైతన్య వేదిక చైర్మన్ లక్ష్మణ్ రెడ్డి, కార్పోరేటర్ స్మిత పద్మజ , అడకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





గ్యాస్ వినియోగదారులు.. వదంతులను నమ్మొద్దు

ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత గద్దె శ్రీనివాస్

ప్రజాశక్తి - దుగ్గిరాల

నిరాధారమైన వదంతులు నమ్మవద్దని స్థానిక ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత గద్దె శ్రీనివాస్ గ్యాస్ వినియోగ దారులను కోరారు. స్థానిక ఏజెన్సీస్ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం శాఖ కోరిన మీదట చేస్తున్న ఈ కెవైసీ డిసెంబర్ 31 చివరి తేదీ అని బయట వ్యాపించిన వదంతులు వినియోగదారులు నమ్మొద్దన్నారు. ప్రస్తుతం ప్రతిరోజు వందల సంఖ్యలో వినియోగదారులు ఈ కేవైసీ చేయించడానికి ఏజెన్సీస్ వద్దకు చేరుతున్నారు. దీనితో రద్దీ పెరిగినది గ్యాస్ ఏజెన్సీస్ అధినేత వివరణ ఇస్తూ ప్రభుత్వం గడువు తేదీ నిర్ణయించలేదని కార్యాలయం వద్దకు రావాల్సిన అవసరం లేదని, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా ఈ-కెవైసి చేస్తారని తెలిపారు. ఈ కేవైసీ చేయకపోతే ప్రభుత్వ పథకాలు రద్దు అవుతాయని జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. గతంలో ఈ కేవైసీ చేసినప్పటికీ చాలామంది చనిపోయిన వారు ఉన్నారని వారి రక్త సంబంధీకుల పేరున బదిలీ చేస్తామన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు బదిలీలపై వెళ్ళిన వారు ఇరుగుపొరుగు వారిని వాడుకోమని తమ సిలిండర్లు అప్పగించి ఉన్నారని అందువల్ల ప్రభుత్వం ఈ కేవైసీ చేపట్టిందన్నారు. వేలిముద్రలు పడని వృద్ధులకు ఐరిష్ ద్వారా ఈ కేవైసీ చేస్తున్నారు. ఆదివారం కూడా ఈ కేవైసీ చేస్తారని ఆయన తెలిపారు.


తుళ్లూరు లో ఆందోళన చేస్తున్న సిపిఐ నాయకులు

సామాజిక పింఛను రూ.5వేలు పెంచి ఇవ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - తుళ్లూరు

ప్రజా వ్యతిరేక భూహక్కుల యాజమాన్య చట్టంను రద్దు చేయాలని, రాజధాని రైతుల బకాయి కౌలును తక్షణమే చెల్లించాలని, రాజధాని పేదల సామాజిక పెన్షన్‌ను హామీ కనుగుణంగా రూ 5వేలకు పెంచి ఇవ్వాలని కోరుతూ రాజధాని ప్రాంతం తుళ్లూరులో శనివారం సిపిఐ ఆందోళన చేపట్టింది. ఇప్పటికే ఇస్తున్న రూ- 2750ల పెన్షన్‌ను రూ 6వేలు, వికలాంగులకు రూ 7వేలు ఇవ్వాలని కోరుతూ లైబ్రరీ సెంటర్ వద్ద సిపిఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ తాడికొండ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, కార్యవర్గ సభ్యులు జివి రాజు మాట్లాడుతూ,భూమి హక్కు యాజమాన్య చట్టం వలన ప్రజలకు ఒనగూడేదేమిలేదని, చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. రాజధాని రైతులకు బకాయి వున్న వార్షిక కౌలును తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుర్రంకొండ సత్యనందం, నాగుల్ మీరా వలి,కె దేవుని దయ పాల్గొన్నారు.



ఎపి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొల్లిపర

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ క్యాలెండర్ 20 24 ను ఏపీ జి ఈ ఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందే బాలచంద్రమౌళి ఆధ్వర్యంలో కొల్లిపర తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ జి నాంచారయ్య ఆవిష్కరించారు. క్యాలెండర్‌లో ఉద్యోగులకు సంబంధించిన సమాచారం ఉన్నందున వారికి ఉపయుక్తంగా ఉంటుందని చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు వంకదార సుబ్బారావు, సెక్రటరీ టి మనోహర్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు బెజ్జం కోటేశ్వరరావు కిరణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్నుకు ఒక్కరోజే గడువు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించటానికి నేడు ఒక్క రోజే అవకాశం ఉందని, జనవరి 1 నుండి వడ్డీ కలిపి చెల్లించాల్సి ఉంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆస్థి పన్ను రూ.65లక్షల, 45వేల, 790లు వసూలు అయినట్లు చెప్పారు. జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయం క్యాష్ కౌంటర్లతోపాటు, నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్ లోని 106 సచివాలయాల్లో కూడా ప్రత్యేక క్యాష్ కౌంటర్లు శెలవు రోజైనా పనిచేస్తాయని, కావున ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు.

క్రోడీకరించి వర్గీకరిస్తేనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి-గుంటూరు



విజ్ఞాన్ వర్సిటీలో మాట్లాడుతున్న బూబలన్

విభిన్న వర్గాల వినియోగదారులు, వారి అభిరుచులు, అవసరాలను గుర్తించే క్రమంలో సమాచారాన్ని సేకరించడం, వాటిని క్రోడీకరించి వర్గీకరిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెన్నైలోని డీఎన్ఈజీ టెక్ మెడోస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డేటా సైంటిస్ట్ డాక్టర్ ఈ.డీ.బూబలన్ తెలిపారు. వడ్లమూడి లోని విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఎండ్ టు ఎండ్ డేటా సైన్స్' అనే అంశంపై రెండ్రోజుల జాతీయ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డేటా సైంటిస్ట్ డాక్టర్ ఈ.డీ.బూబలన్ మాట్లాడుతూ వినియోగదారుల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, సూచనలు, సలహాలతో కూడిన నివేదికలు రూపొందించే డేటా సైంటిస్ట్‌లకు ఇటీవల కాలంలో డిమాండ్ విపరీతంగా పెరుగుతోందన్నారు. ముఖ్యంగా ఈ-కామర్స్, ఐటీ రంగ సంస్థల్లో డేటా సైంటిస్ట్‌ల కొరత ఉందన్నారు. మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ వంటి స్పెషలైజేషన్లు చదివి స్టాటిస్టికల్ అనాలిసిస్ సిస్టమ్, హడూప్ వంటి సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లలో శిక్షణ పొందితే డేటా సైంటిస్ట్ నైపుణ్యాలు సొంతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డేటా సైంటిస్ట్ వినోత్‌కుమార్, విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.


గుంటూరు జిల్లా కార్యాలయంలో ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరిస్తున్న అబ్దుల్ రఫీక్, పాశం రామారావు, జి శివరామకృష్ణ తదితరులు

వాస్తవిక ధృక్పధంతో వార్తలు రాయండి

ప్రజాశక్తి కేలండర్, డైరీ ఆవిష్కరణ సభల్లో అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్

మానవీయ కథనాలు, ప్రజా సమస్యలపై వాస్తవిక ధృక్పధంతో వార్తలు ప్రచురించాలని సమాచార, పౌరసంబంధశాఖ ఉపసంచాలకులు అబ్ధుల్ రఫిక్ కోరారు. గుంటూరులోని ప్రజాశక్తి జిల్లా కార్యాల యంలో 2024 కేలండర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. డైరీని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆవిష్కరించారు. ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ సుధాకిరణ్ అధ్యక్షత వహించారు. నూతన అబ్దుల్ రఫిక్ మాట్లాడుతూ వాస్తవాల కన్నా అవాస్తం తొందరగా ప్రజల్లోకి వెళ్తుందని ఈ పరిస్థితుల్లో ప్రజాశక్తి పత్రికలలో అభూత కల్పనలకు అవకాశం లేకుండా వాస్తవ పరిస్థితిని ప్రతిబింభించే అంశాలు ప్రచురించడం ముదావాహం అన్నారు. సోషల్ మీడియా తాకిడికి ప్రింట్ మీడియా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటుందన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజాకోణంలో పనిచేయాలన్నారు. అధికారంలో ఉన్న పార్టీలకు మద్దతు పలికే పత్రికల్లో ప్రజా ఉద్యమాలకు ప్రాధాన్యత లభించకపోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పత్రికల్లోనే ప్రజా ఉద్యమాలకు కొంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజాశక్తి రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కర్షకులు,శ్రామికులు,ఉద్యోగుల సమస్యలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం సామాజిక బాధ్యత అన్నారు. ప్రజాశక్తి సామాజిక బాధ్యతను నెరవేరు స్తుందన్నారు. సమావేశంలో ప్రజాశక్తి జనరల్ మేనేజరు జి.శివరామకృష్ణ, సిహెచ్ శంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. సంవత్సర వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి - నరసరావుపేట : పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రజాశక్తి క్యాలెండర్ మరియు డైరీ ఆవిష్కరించారు. నరసరావుపేటలో డి.ఎస్.పి మరియు ఆర్ డి ఓ ఆఫీస్ లో డిఎస్పి కెవి మహేష్ మరియు ఆర్డిఓ శేషిరెడ్డి ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలనాడు జిల్లా విలేకరులు ప్రేమ్ సాగర్, శ్రీనివాస రావు, ఏడుకొండలు, మస్తాన్ వలి, రాంబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ప్రజా సమస్యలు వెలిగెత్తి, సమస్యలు పరిష్కరించాలని కోరేది ప్రజాశక్తి పత్రిక మాత్రమేనని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి లో శనివారం నూతన సంవత్సర ప్రజాశక్తి క్యాలెండర్ ను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ శంకరరావు మాట్లాడుతూ సమస్య ఎక్కడ ఉంటే, ప్రజాశక్తి ప్రజల పక్షాన నిలబడి, సమస్య పరిష్కరించాలని వెలుగెత్తి చాటుతుందని అన్నారు.కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి , మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, కాజా సురేష్, మారుమాకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు పొర్లు దండాలతో నిరసన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేటలో ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళుతున్న ఉద్యోగులు


గుంటూరు సమ్మె శిబిరంలో పొర్లుదండాలు పెడుతున్న ఉద్యోగులు

విద్యాశాఖ పరిధిలో చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ సమాన పనికి సమాన వేతనం అమలు చేసే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 10వ రోజుకు చేరుకుంది. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నరసరావుపేట సమ్మె శిబిరంలో మహిళా ఉద్యోగులు మోకాళ్లపై మోకరిల్లి నిరసన తెలిపారు. పొర్లు దండాలు పెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి, యుటిఎఫ్ పెదకూరపాడు మండల అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదని పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించి అన్ని విభాగాల ఉద్యోగులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె శిబిరం వద్ద నుండి పల్నాడు రోడ్డు గుండా గడియార స్తంభం సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి శంకర్రావు, ఎండి హసన్, ఉద్యోగులు అంజిరెడ్డి, పి రామకష్ణ, పి సాంబశివరావు, జి లాజర్, కె.సుబ్బారావు, శ్రీకాంత్, సాంబశివరావు, వెంకట్, వై.సుబ్బాయమ్మ, కాంచన, రజిని, మమత పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు : గత పది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె గుంటూరులో కొనసాగుంది. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో ప్రభుత్వానికి ఉద్యోగులు పొర్లు దండాలు పెట్టి సమస్యలు పరిష్కరించమని కోరుతూ నిరసన తెలిపారు. సమ్మె శిబిరానికి సమగ్ర శిక్ష జెఎసి నాయకులు శ్రీదేవి అధ్యక్షత వహించారు.కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.మస్తాన్‌వలి సమ్మె శిబిరంలో ప్రసంగించి మద్దతు తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై తక్షణమే ప్రభుత్వం కలుగజేసుకుని పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎదుర్కొన్నటువంటి ప్రధానమైన సమస్యలు హెచ్.ఆర్ పాలసీని అమలు చేయాలని, సమగ్ర శిక్షలో ఉన్న అన్ని రకాల ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పాఠశాల విద్యా వ్యవస్థ నడవడంలో కీలకంగా ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల కాలంలో పూర్తిగా విఫలమైందన్నారు. గత్యంతరం లేని కారణంగానే రోడ్డుపైకొచ్చి ఆందోళన చేపట్టారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నోబుల్ టీచర్స్ యూనియన్ నాయకులు హైమారావు, జగదీష్, అలాగే వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు సమ్మె శిబిరం వద్దకు వచ్చి ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు శివప్రకాష్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, కోశాధికారి గంగయ్య, నాయకులు కిరణ్‌కుమార్, శివపార్వతి, దుర్గా, సతీష్, జానీభాషా తదితరులు పాల్గొన్నారు.


నరసరావుపేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

వైసిపిలో టిక్కెట్ల రాజకీయం

వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి వైసిపిలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు ప్రకటన కన్నా రెండు నెలలు ముందే అభ్యర్థు లను ఖరారు చేసే ప్రయత్నంలో వైసిపి అధిష్టానం ఉంది. ఈమేరకు గత వారం రోజులుగా ముమ్మరంగా కసరత్తు జరుగు తోంది. ఇటీవల జిల్లాలో మంగళగిరి, గుంటూరు పశ్చిమ, వేమూరు, రేపల్లే, చిలకలూరిపేట, పత్తిపాడు, తాడికొండ నియోజ కవర్గాలకు ఇప్పటికే కొత్త ఇన్‌ఛార్జిలను ప్రకటిం చారు. గుంటూరు లోక్‌సభ పరిధిలో తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తప్ప మిగతా వారందరినీ మారుస్తారనే ప్రచారం జరుగు తోంది.

గుంటూరు తూర్పు నుంచి ముస్తాఫా కుమార్తె నూరిఫాతిమా పేరు దాదాపు ఖాయంగా చెబుతున్నారు. ఈ స్థానంలో కొత్త అభ్యర్థులను కూడా పరిశీలిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.పల్నాడుజిల్లాలోని నర్సరావుపేట, గురజాల, సత్తెనపల్లి ఎమ్మెల్యేలకు అసమ్మతి పెరుగుతోంది. నర్సరావుపేటలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా గజ్జెల బ్రహ్మారెడ్డి వర్గం పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తోంది. సిఎం క్యాంపు కార్యాలయం ఎదుట కూడా బ్రహ్మారెడ్డి వర్గం ధర్నా చేసింది. గురజాలలో ఎమ్మెల్యే కాసు మహేష్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి పావులు కదుపుతున్నారు. ఈసారి తానేపోటీ చేస్తానని, తనకే టిక్కెట్ ఇవ్వాలని పట్టుపడుతున్నారు. గోపిరెడ్డిని నర్సరావుపేటలో మారిస్తే తనకు టిక్కెట్ ఇవ్వాలని కాసు మహేష్ రెడ్డి కోరుతున్నారని తెలిసింది. కాసు మహేష్‌రెడ్డి తీరుకు నిరసనగా జంగా కృష్ణమూర్తి కుమార్డు పిడుగురాళ్ల జెడ్పిటిసి జంగా కోటయ్య శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఎవరి దయా దాక్షిణ్యాలతో తనకు ఈ పదవి రాలేదన్నారు.

సత్తెనపల్లిలో అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా ఒక సామాజిక వర్గం పావులు కదుపుతోంది. తాజాగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పేరును బాపట్ల అసెంబ్లీకి పరిశీలిస్తున్నట్టు తెలిసింది. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేరును విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పరిశీలిస్తున్నట్టు సమాచారం. పల్నాడు జిల్లాలో గురజాల,నర్సరావుపేట, సత్తెనపల్లి స్థానాల్లో మార్పులు, చేర్పులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది.

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వైసిపికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన బావ, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డికి పల్నాడులో ఒక నియోజకవర్గం కేటాయిస్తారని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. వేణుగోపాలరెడ్డి సత్తెనపల్లి స్థానంపై ఆసక్తి కనబరుస్తున్నారు. సత్తెనపల్లిలో మంత్రి అంబటిరాంబాబును మార్చకుండా ఉంటే నర్సరావుపేట, లేదా గురజాలకు మోదుగుల పేరును పరశీలించే అవకాశంఉంది. ప్రస్తుతానికి పెదకూరపాడు, వినుకొండ, మాచర్ల ఎమ్మెల్యేలకు మార్పు ఉండకపోవచ్చునని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సామాజిక సమీకరణలో ఇప్పటికే మంగళగిరి, గుంటూరు పశ్చిమ బిసిలకు కేటాయించగా పల్నాడు జిల్లాలో కూడా ఒక నియోజకవర్గం బిసిలకు కేటాయిస్తారని తెలిసింది. ఇటీవల వైసిపిలో చేరిన క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడికి గుంటూరు ఎంపిగా టిక్కెట్ ఇచ్చే అవకాశం ఉంది. ఆయన పేరు మచిలీపట్నం, ఏలూరుకు కూడా పరిశీలిస్తుండటంతో కొంత అయోమయం వ్యక్తం అవుతోంది. నర్సరావు పేట ఎంపి లావు కృష్ణదేవరాయులు తాను ఇక్కడే పోటీ చేస్తానని, మారిస్తే తాను పోటీ చేయనని చెప్పినట్టు తెలిసింది. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు ఎక్కడ అవకాశం ఇస్తారన్నదీ ఇంకా స్పష్టత రాలేదు. వైసిపికి రాజీనామా చేసిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తాను షర్మిల బాటలోనే నడుస్తానని ప్రకటించారు.

ఎవిడి శర్మ